www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 10 | నవంబర్ | 2025 పేజీలు : 8

## అమరుల ఆశయసాధనకు పునరంకితమవుదాం




- పార్టీ విస్తరణకు కేశవరావు చేసిన కృషి మరువలేనిది
- సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని

2 లో

# అస్తవ్యస్థంగా రోడ్లు..!





-పెరుగుతున్న ప్రమాదాలు
-నెలలు గడిచినా కరువైన మరమ్మతులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రోడ్లు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. పెద్ద పెద్ద గుంటలతో వాహనదారులకు అడుగడుగునా ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఎక్కడో మారుమూల రహదారులు దెబ్బతిన్నాయను కుంటే పొరపాటే. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులు గుంటలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఖమ్మం జిల్లాలోనే అతి రద్దీగా ఉండే రహదారిగా చెప్పుకునే వైరా, మధిర ప్రధాన రహదారిపై కొణిజర్ల, వైరా మధ్య ఏర్పడిన గుంటల కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. గుంటల కారణంగా ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది

మిగతా 2లో..

## జామాయిల్ అడితిలో అక్రమాలు..!





-రూ. 500 కోట్ల జీరో లావాదేవీలు
-ఆ వైపు కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/ ముల్కలపల్లి :** చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు సైతం పన్నులు చెల్లించకపోతే వేటాడి వెంటాడే అధికారులు ఏడాది పొడవునా ఎటువంటి పన్నులు చెల్లించకుండా జీరో దందా నిర్వహిస్తున్న పట్టించుకోకపోవడం శోచనీయం. చిన్న సన్న వ్యాపారం కాదు ఏకంగా రూ. 500 కోట్ల టర్నోవర్ కలిగిన జామాయిల్ అడితి మొత్తంలో జీరో దందా నడుస్తుంది. ఒక పక్క ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులు పెట్టే జామాయిల్ వ్యాపారులు మరో పక్క ప్రభుత్వానికి సైతం పన్నులు ఎగవేస్తూ కోట్లు గడిస్తున్నారు. ఏజెన్సీ నిబంధనలకు విరుద్దంగా ముల్కలపల్లి మండలం మొత్తంలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. పిసా చట్ట నిబంధన ప్రకారం గ్రామసభ ఆమోదం పొందిన తర్వాతే వ్యాపారం నిర్వహించాలి. కానీ అవేవి ఇక్కడ పట్టింపు కాదన్నట్లుగా వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ఇతర రాష్ట్రాల

మిగతా 2లో..

## శాశ్వత మార్కెట్‌కు మోక్షమెన్నడో..?



-ఆట స్థలంలో తాత్కాలిక పత్తి కొనుగోళ్ల ఏర్పాటు
-నిధులు మంజూరైనా ప్రారంభం కాని మార్కెట్ యార్డు పనులు
-సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న హమాలీలు

ప్రజాపక్షం/జూలూరుపాడుః రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు అమ్ముకునేందుకు అప్పటి ప్రభుత్వం 2003లో ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేస్తూ, జూలూరుపాడు మండలాన్ని ఏన్కూరు పరిధిలోకి చేర్చింది. అప్పటి వరకు కొత్తగూడెం వ్యవసాయం మార్కెట్ కమిటీలో ఈ ప్రాంతం ఉండేది. అయితే జూలూరుపాడు మండలంలో అత్యధిక విస్తీర్ణంలో పత్తి పంటను రైతులు సాగు చేస్తుండటంతో పంటను అమ్ముకునేందుకు రైతులకు పెద్ద సమస్యగా మారింది. దీంతో రైతు సంఘాలు, రైతులు స్థానికంగా పత్తి కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్యవేక్షణలో తాత్కాలిక ఉప మార్కెట్ యార్డును ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రారంభించారు. రెండు దశాబ్దాలుగా తాత్కాలిక యార్డ్ లోనే కొనుగోళ్లు జరుగుతున్నా ప్రభుత్వ గుర్తింపు లేకుండా పోయింది. ఆనాటి

మిగతా 2లో..

# అస్తవ్యస్థంగా రోడ్లు..!





(మొదటిపేజీ తరువాయి)

భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఇక గ్రామీణ రహదారుల వంక చూసిన నాధుడే కనిపించడం లేదు. మూడు నెలలుగా అధికార యంత్రాంగం రోడ్ల మరమ్మతులకు అంచనాలు వేయడంతోనే సరిపోయింది తప్ప మరమ్మతులు చేపట్టింది లేదు. ఖమ్మం నగరంలోని రహదారులపై ఏర్పడిన గుంటలను మాత్రం పూడ్చుతున్నారు తప్ప జిల్లాలో ఎక్కడ మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఖమ్మం, కోదాడ, ముదిగొండ రోడ్డు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. ద్విచక్ర వాహనాలు సైతం నడిచే పరిస్థితి లేదు. కల్లూరు, మధిర సైతం అదే పరిస్థితి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రధాన రహదారులకు సంబంధించి మరమ్మతులు చేయాలని ప్రజలు ఆందోళన చేపట్టినా ప్రభుత్వం స్పందించ లేదు. గోదావరి ఇసుకను తరలించే ప్రక్రియలో అధిక లోడుతో వెళ్తుండడంతో రోడ్లు మొత్తం అస్తవ్యస్థంగా తయారయ్యాయి. భద్రాచలం వెంకటాపురం రోడ్డు, పాల్వంచ, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లందు రోడ్లకు కూడా పలు చోట్ల గుంటలు పడి ఇబ్బంది కరంగా మారాయి. ఖమ్మం జిల్లాలో కల్లూరు నుంచి మధిర వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంటలు పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. జూలూరుపాడు మండలంలోని వినోబానగర్ నుంచి కొమ్ముగూడెం వరకు కొత్తగూడెం ప్రధాన రహదారి గుంటలు పడి దుమ్ము లేచిపోతుంది. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై వాహనాలు నడిపే పరిస్థితి లేదు. రాత్రి సమయాల్లో గుంటలు సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రద్దీగా ఉండే రహదారుల్లో రాత్రి పూట ప్రయాణికులకు సరిగ్గా గుంటలు కనిపించక ప్రాణాలు కోల్పోతున్నారు. మధిర నియోజక వర్గంలోని పలు ప్రధాన రహదారులకు గుంటలు పడ్డాయి. వేసవి కాలం సమీపిస్తుండటం, ప్రయాణికుల రద్దీ మరింత పెరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే రహదారుల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని, యుద్ధప్రాతిపదికన రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.

# శాశ్వత మార్కెట్‌కు మోక్షమెన్నడో..?





(మొదటిపేజీ తరువాయి)

నుంచి ప్రత్యేకంగా జూలూరుపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోలేదు. ఎన్నికల వేళ నాయకుల శాశ్వత మార్కెట్ ఏర్పాటుకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.

**పత్తి కొనుగోళ్లలో జూలూరుపాడు మార్కెట్ అగ్రస్థానం...**

జూలూరుపాడు ఉపమార్కెట్ పత్తి కొనుగోళ్లలో అగ్రస్థానం కుంట, భద్రాచలం పలు ప్రాంతాలతోపాటు పాటు సరిహద్దు ఆంధ్ర రాష్ట్రంలోని ప్రాంతాల రైతులు ఇక్కడి మార్కెట్కు పత్తిని తీసుకొచ్చి అమ్ముకుంటారు. దసరా పండుగ నుంచి ఉప మార్కెట్ యార్డ్ లో పత్తి కొనుగోళ్లు ప్రతి ఏటా ప్రారంభమై మార్చి నెల వరకు జరుగుతాయి. జూలూరుపాడు మార్కెట్ నుంచి మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహారాష్ట్ర, గుజరాత్ వంటి ఇతర ప్రాంతాలకు కూడా ఇక్కడి వ్యాపారులు పత్తిని ఎగుమతి చేస్తుంటారు. జూలూరుపాడు ఉప మార్కెట్ పరిధిలో 19 మంది వ్యాపారులు లైసెన్స్ పొంది ఉన్నారు. జూలూరుపాడు మార్కెట్లో 114 మంది హమాలీలు పనిచేస్తున్నారు.

**నిధులు మంజూరైనా ప్రారంభం కాని మార్కెట్ పనులు..!**

జూలూరుపాడు మండల పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ పత్తి మార్కెట్ లో సరైన వసతులు లేక రైతులు, హమాలీలు, ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాలు, రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో నిరసనలు వారి కృషి, పట్టుదల ఫలితంగా జూలూరుపాడులో శాశ్వత పత్తి మార్కెట్ యార్డ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ. 3.30 కోట్ల నిధులు మంజూరు చేయబడినట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ పి.రవికుమార్ తెలిపారు. ఈ నిధుల కేటాయింపుతో జూలూరుపాడులోని సర్వే నెంబర్ 218 నందు. 10 ఎకరాల ప్రభుత్వ స్థలంలో శాశ్వత మార్కెట్ యాడ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి, భూమి చదును, చెట్ల తొలగింపు పనులతో పాటు ఒక షెడ్డు, రెండు క్యాబిన్ల నిర్మాణం చేపట్టే ఏర్పాట్లు జరుగుతున్నాయని టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

**సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్న హమాలీలు...**

ఈ ఏడాదిలోనే శాశ్వత మార్కెట్ యాడ్ నిర్మాణం చేపట్టి పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని. రైతులు, రైతు కూలీలు, హమాలీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించబడతాయని మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ తెలిపి నెలలు గడుస్తున్నా నేటికీ మార్కెట్ పనులు ప్రారంభం కాకపోవడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కి కేటాయించిన ఆట స్థలంలో పత్తి కొనుగోలుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మార్కెట్లో హమాలీలకు ఇబ్బందులు తప్పడంలేదు. భోజనం చేయడానికి నిలువ నిడలేని బండ రాళ్ల మీద, కూర్చొని భోజనం చేయాల్సి వస్తుందని హమాలీలు ఆవేదన వ్యక్తం చేతున్నారు.

# గుంతలమయంగా పెద్ద వంతెన..!

**ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణ శివార్లలోని పెద్ద వంతెన గుంటల మయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు, గంగారం మాజీ సర్పంచ్ సహకారంతో గుంటలు పూడ్చినారు. అయితే భారీ వాహనాలు తిరుగుతుండటంతో మరలా గుంటలు పెద్దవిగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పట్టణంలో ప్రధాన రహదారి ఎగుడు, దిగుడుగా మారటంతో పాటు మిషన్ భగీరథ పైప్ లైన్ పనుల కోసం గోతులు తవ్వి వాటిని సక్రమంగా పూడ్చకపోవటం వల్లన కూడా ప్రదాన రహదారి గుంతల మయంగా మారింది. తక్షణమే అదికారులు స్పందించి పెద్ద వంతెనపై గల గుంటలతో పాటు పట్టణంలోని ప్రదాన రహదారిపై గల ఎగుడు, దిగుడులను సరిచేసి, గుంతలను పూడ్చాలని వాహనదారులతో పాటు పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# అమరుల ఆశయసాధనకు పునరంకితమవుదాం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేద వర్గాల అభ్యున్నతి కోసం, పార్టీ విస్తరణ కోసం నిరంతరం కృషి చేసిన అమరుల ఆశయాల సాధనకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పునరాంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ, ఏఐకేఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు భాగం కేశవరావు సంతాప సభ మండలంలోని కేశవరావు స్వగ్రామం కొత్త అంజనాపురంలో గ్రామంలో ఆదివారం జరిగింది. సంతాపసభకు ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా తదితరులు కేశవరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో కూనంనేని మాట్లాడుతూ సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో పార్టీ విస్తరణకు కేశవరావు యనలేని కృషి చేశారన్నారు. అనేక ప్రజా, రైతు ఉద్యమాలు నిర్మించి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకునిగా ప్రతీ పోరాటంలో అగ్రభాగాన నిలిచారని కొనియాడారు. కేశవరావు ఆశయాలను సాధించేందుకు నేటితరం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బూక్యా ధస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, భాగం కృష్ణయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జామాయిల్ అడితిలో అక్రమాలు..!



(మొదటిపేజీ తరువాయి)

నుంచి వచ్చి జామాయిల్ అడితిలను ఏర్పాటు చేసి రైతులను దోచుకుంటున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసేటప్పుడుకానీ చెల్లింపుల సమయంలో కానీ ఎటువంటి పత్రాలు ఉండవు. వారు చెప్పిందే వేదం. కలప తూకం, బిల్లు తప్ప మరొకటి రైతులకు ఇవ్వరు. 2017 జులై ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన జిఎస్టితో ప్రజల నడ్డివిరుస్తున్న ప్రభుత్వం ఇటువంటి వ్యాపారులను మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ముల్కలపల్లి మండల వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ వ్యాపారులపై తగు చర్యలు తీసుకోవాలని, రైతులను పీడిస్తూ ఏజెన్సీ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న వ్యాపారులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# భద్రాచలం, కొత్తగూడెంలో ప్రజావాణి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాయం, కొత్తగూడెం ఆర్‌డిఓ కార్యాలయాల్లో ప్రజల సౌకర్యార్థం సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లాకలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ సమస్య పరిష్కారానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి ప్రజలు ప్రజావాణికి వస్తున్నందున వారి సౌకర్యార్థం డివిజన్ల వారీగా ప్రజావాణి నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు భూ సమస్యల పరిష్కారం నిమిత్తం దరఖాస్తు చేసుకునేందుకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం డివిజన్ ప్రజలకు కొత్తగూడెం ఆర్‌డిఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఇతర సమస్యలకు దరఖాస్తులు చేసే వారు కలక్టరేట్‌లోని ఇన్‌వార్డులో తమ దరఖాస్తులను అందించి రశీదు పొందాలని, దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

# ఉచిత న్యాయసేవలు సద్వినియోగం చేసుకోండి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉచిత న్యాయసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెంబార్ కౌన్సిల్ అసోసియేషన్ సభ్యులు లక్కినేని సత్యనారాయణ అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా పాల్వంచలోని వికలాంగులు కాలనీలో ఆదివారం న్యాయసేవల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బలహీన వర్గాల వారికి, దివ్యాంగులు న్యాయ సహాయం పొందటంలో అన్ని హక్కులు, అవకాశాలు ఉన్నాయన్నారు. ఆర్థిక, సామాజిక ఇతర కారణాల వల్ల న్యాయ సహాయం పొందలేని వారికి ఉచితంగా, సమర్థవంతంగా న్యాయ సేవలు అందించడమే న్యాయసేవల దినోత్సవ ఉద్దేశ్యం అన్నారు. న్యాయసేవల అధికార సంస్థల చట్టం 1987 అమల్లోనికి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏటా నవంబర్ 9న జరుపుకుంటామని చెప్పారు. పలు చట్టాలు, న్యాయ సేవలపై విపులంగా వివరించారు. అదాయ పరిమితి ఉన్న వారు, , షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన వారు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు వంటి వారికి ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకుని అన్యాయంపై పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నిరంజన్ రావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జే గోపికృష్ణ, న్యాయవాదులు ఎర్రపాటి కృష్ణ, హరి, దేవేందర్, పారా లీగల్ వాలంటీర్స్ బి భిక్షమయ్య, జానకిరామ్, వీరభద్రం, రాజమణి, ఏజిఓ రమాదేవి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ కార్మికులు బిల్లులు, వేతనాలు, కోడిగుడ్డు బిల్లులు కొరకు 8వ తేదీ నుండి వారం రోజులు పాటు రోజు వారి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు తెలిపారు. గత డిసెంబర్ నుంచి నేటి వరకు కోడుగుడ్డు బిల్లు, బకాయిలు, వేతన బకాయిలు, మెనూచార్జీల బకాయిలు, గత కొన్ని నెలలుగా ఏజెన్సీ కార్మికులకు అందక అనేక అవస్థలు పడుతున్నట్లు కుటుంబాలు అప్పులు భారాలతో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. వేతన బకాయిలు పడే వరకు అధికారుల వద్ద మధ్యాహ్న భోజనం వంట తయారు చేస్తున్న పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీల బకాయిలు పేరుకుపోయి ఏజెన్సీల అప్పుల భారం కుటుంబాల అప్పుల భారం తో ఇబ్బందులు పడుతూ మోయలేని భారాలు మోస్తున్నామని వారు తెలుపుతున్నారు. ఎక్కువగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలైన కల్లూరు బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పేరువంచ, చిన్న కోరుకొండి, బత్తులపల్లి, వెన్నవల్లి, మర్లపాడు తదితర ఉన్నత పాఠశాలలతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో కొన్ని నెలలుగా బకాయిల భారంతో ఏజెన్సీ కార్మికులు మోయలేకపోతున్నామని పేర్కొంటున్నారు. కనుక ఖమ్మం కలెక్టర్, కల్లూరు సబ్ కలెక్టర్, తహసిల్దార్, మండల విద్యాశాఖ అధికారి, తదితర కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

# సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సేంద్రియ ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సేంద్రియ రైతు బజార్‌ను కాంగ్రెస్ యువ నాయకులు, ప్రముఖ సేంద్రియ వ్యవసాయ మార్గదర్శి తుమ్మల యుగంధర్ సందర్శించారు. ఈ సందర్భంగా సేంద్రియ పంటలు, సాంప్రదాయ విత్తనాలు, దేశీ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారి అనుభవాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎటువంటి రసాయనాలను వాడకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేసి పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. రైతులు సహజ ఎరువులు, జీవామృతం, గోమూత్ర ఆధారిత వాడకం, విత్తన సంరక్షణపై అవగాహన కల్పించారు. విత్తన బ్యాంకులు, రైతుల మధ్య విత్తన మార్పిడి కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పరుచూరి దంత వైద్యశాల వార్షికోత్సవం





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పరుచూరి దంత వైద్యశాల 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని పరుచూరి దంత వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. వైద్యులు పరుచూరి వెంకటేశ్వరరావును శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం దంత వైద్యశాలను ఖమ్మం నగరంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు దంత సమస్యలతో బాధపడే రెండు లక్షల మందికి పైగా రోగులకు చికిత్సలు అందించినట్లు ఆయన తెలిపారు. దంత వైద్య విభాగంలో మొత్తం ఏడు కేటగిరిలు ఉన్నాయని ఆ ఏడు కేటగిరిలు కూడా ఖమ్మం నగరంలో పరుచూరి వైద్యశాలలో అత్యాధునీక వసతులతో అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్య విద్య పూర్తి కాగానే తాను పుట్టి పెరిగిన ఖమ్మం జిల్లా ప్రజలకు సేవలందించేందుకు 1996 నవంబర్ తొమ్మిదిన మా ఇంటి పేరుతో పరుచూరి దంత వైద్యశాలను స్థాపించినట్లు ఆయన తెలిపారు. 30 సంవత్సరాలుగా ఆదరిస్తున్న ఖమ్మం జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని 38 కొనుగోలు కేంద్రాలలో ఖరీఫ్ సీజన్లో ఐకెపి, డీసీఎంఎస్, పిఎసిఎస్, మెప్మా, వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ళు ముమ్మురంగా కొనసాగుతున్నట్లు తహశీల్దార్ పులి సాంబశివుడు, వ్యవసాయ శాఖ అధికారిని రూప, సివిల్ సప్లై డిటినరేష్ లు తెలుపుతున్నారు. మండలంలో సన్నాలు, లావులు ధాన్యం రైతులు తీసుకొని వచ్చి మద్దతు ధరను పొందాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. మండల పరిధిలోని పుల్లయ్య బంజర, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, జిడిపి పల్లి ,పెద్ద కోరుకొండి, పోచవరం, లింగాల, కల్లూరు తదితర కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ముమ్మరంగా కొనుగోలులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర ఏ గ్రేడ్ 23 89, బి గ్రేడ్ 23 69 ధరను పొందాలని అధికారులు రైతులను కోరుతున్నారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధర పొంది లాభాలను పొందాలని రైతులను అధికారులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వారి పేర్కొన్నారు. ప్రతిరోజు సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు.

# అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్, జేసిబి సీజ్




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజాపక్షం తెలుగు దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన బరితెగించిన మట్టి మాఫియా కథనంపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు స్పందించారు. సరైన డాక్యుమెంట్లు లేకుండా పాత కొమ్మేపల్లి రోడ్డు నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న అశోక్ లేలాండ్ వాహనంతో పాటు మట్టిని తోలుస్తున్న జెసిబి వాహనాన్ని సైతం రెవిన్యూ శాఖా వారి సమాచారంతో మైనింగ్ ఏడి రమేష్ నేతృత్వంలోని బృందం అడ్డుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించింది. ఈ సందర్భంగా మైనింగ్ ఏడి, సత్తుపల్లి తహశీల్దార్లు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరంగా శిక్షిస్తామని, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# జోరుగా కాంగ్రెస్ నేతల ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు, మంత్రి క్యాంప్‌కార్యాలయ ఇంచార్జ తుంబూరు దయాకర్‌రెడ్డి సూచనలతో ఖమ్మంరూరల్ కాంగ్రెస్ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి ఆధ్వర్యంలో అక్కడి బోరంబడలోని షాపులు, ఇంటింటికి, పాదచారులను కలిసి హస్తం గుర్తుకే ఓటు వేసి అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ ఎమ్మెల్యే మందుల సామేలు కుమారుడు మందుల సూర్య కుమార్, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, తోట వీరభద్రం, తేజావత్ పంతుల్‌నాయక్, ముత్యం కృష్ణారావు, గునిగంటి సురేష్, ఆరెంపుల రామయ్య, మొండెం వెంకటేష్, సింగిరెడ్డి, బోసిరెడ్డి, మద్ది వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌సిఎం చర్చిలో బైబిల్ పరీక్షలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు ఆర్సీఎం చర్చి, పెద్ద కోరుకొండి లో ఆర్‌సిఎం చర్చిలో ఆదివారం బైబిల్ పరీక్షలు జరిగాయి. నాలుగు విభాగాలుగా నిర్వహించిన ఈ పరీక్షలలో ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకువిద్యార్థులు మరియు విద్యావంతులైన మహిళలు ఈ పరీక్షలలో పాల్గొన్నారు. పరీక్షలలో ప్రతిభ కనబడిన వారికి నగదు, ప్రోత్సాహ బహుమతులు ఖమ్మం బిషప్ ద్వారా అందించనున్నట్లు మత గురువులు వినయ్, అంతోని లు తెలిపారు. ఫలితాలు డిసెంబర్ 25వ తేదీ కల్లా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలలో వంద మంది విద్యార్థిని విద్యార్థులు, విద్యావంతులు, చిన్న కోరుకొండి ,పెద్ద కోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి మహిళలు పాల్గొనగా పర్యవేక్షకులుగా మత గురువులు, కన్య స్త్రీలు, ఉపదేశకులు పాల్గొన్నారు

# పది విద్యార్థులకు స్పెషల్ తరగతులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం రెబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆదివారం ఇతర ప్రభుత్వ సెలవు దినములు, ప్రతిరోజు సాయంత్రం రోజుల్లో రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు రాకముందే ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఈ రకంగా విద్యార్థుల కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారానికి గాను కొంత సొమ్మును విరాళంగా అందజేసి సాయంత్రం అల్పాహారాన్ని అందిస్తూ ఆకలి లేకుండా విద్యార్థులు చదువుఓవడానికి సహకారం అందిస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాలు, ఏఎఇసం చైర్మన్ తులశమ్మ ధన్యవాదాలు తెలిపారు.

# కిష్టాపురం తండలో సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని కిష్టాపురం తండాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, డ్రైనేజీలు నిర్మించాలని సిపిఐ (ఎం)మండల కమిటీ సభ్యులు కావూరి వెంకటేశ్వరరావు కోరారు. పార్టీ మండల కమిటీ బృందం ఆదివారం కిష్టాపురం వెనక తండా సమస్యలపై సర్వే నిర్వహించింది. తండాలో మంచినీటి పైపులు పగిలి మూడు నెలలు అవుతున్న గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నీళ్లు వదిలే సందర్భంలో పగిలిన పైపుల నుండి నీళ్లు బయటకు వచ్చి అవి ఇళ్లలోకి, రోడ్లపై వెళ్లడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కువారపు లక్ష్మణరావు, హసావత్ కృష్ణ, బర్మా వత్ అరుణ్ కుమార్, అజ్మీర విజయకుమార్, లకావత్ మారేష్, ధరావత్ నాగమణి, అజ్మీర రాము, లావిడియా తదితరులు పాల్గొన్నారు.

## వనాల సందడి...!



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం వనాలలో సందడి నెలకొంది. బోదులబండ గ్రామంలో వన భోజనాల కార్యక్రమం ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డప్పు, వాయిద్యాలతో, ఉరేగింపు ప్రదర్శనలు, నృత్యాలతో జాతరగా నిర్వహించారు. మండల కేంద్రం లోని సింగారెడ్డిపాలెం లో మామిడి తోటలో అయ్యప్ప మాలధారణ గురు స్వామి దేవరశెట్టి వెంకటేశ్వర్లు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తుల వనసమారాధన కార్యక్రమం ను నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ఆటా, పాటలతో సందడి చేశారు. ఉసిరి చెట్టు కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం చైర్మన్ మన్నె రవి, చిదుముల జానారెడ్డి, బీమాల గోపి, షరాబు పవన్, కాసాని లింగయ్య, ఉపేందర్. మేట్టేల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేవా వెల్ఫేర్ సొసైటీ ఆవిర్భావం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని సారపాక గ్రామంలో మేవా వెల్ఫేర్ సొసైటీ సేవా కార్యక్రమాల నిర్వహణకు స్థానిక ఐటిసి కర్మాగారంలో పని చేస్తున్నటువంటి ముస్లిం సోదరులు యువకులంతా కలిసి స్వచ్ఛంద సేవ సంస్థ ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవా) రిజిస్ట్రేషన్ నంబర్ 187/2025 స్థాపించినట్లు మేవా వెల్ఫేర్ సొ సైటీ ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సోహెల్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్గనైజేషన్ ద్వారా సామాజిక మానవతా, ధార్మిక రంగాల్లో, సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ సంస్థ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్షిప్, కోచింగ్ వంటి విద్యా సహాయాన్ని అందించడం, అలాగే ఆరోగ్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు వంటి వైద్య సహాయాన్ని అందించడం, అనాథలు, వితంతువులు, ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమం కోసం పని చేయడం, శిక్షణ, స్వయం సహాయక బృందాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళలను శక్తివంతం చేయడం జరుగుతుందన్నారు. కుల, మత లేదా వర్గానికి అతీతంగా సామాజిక సంక్షేమ కార్యకలాపాలను నిర్వహించడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశమని అన్నారు.

## సోలార్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సోలార్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం న్యాయం చేయాలని ఐఎఫ్టియూ ఖమ్మం జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల ఉసిరికాయలపల్లి పరిధిలోని సోలార్ కార్మికులు పడుతున్న ఇబ్బందులపై ఆయన మట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని, ఆ సోలార్ సింగరేణి యాజమాన్యం 30 మంది కార్మికులు గత మూడు నెలల నుండి పనిలోకి తీసుకోవడం లేదని అన్నారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డుపైకి వచ్చాయని తెలిపారు. యాజమాన్యం అవలంభిస్తున్న వేతనాన్ని తక్షణమే ఉపసంహరించుకొని కార్మికులందరినీ ఉద్యోగాల్లో తీసుకోవాలని లేనిపక్షంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో శ్యాం బాబు, ప్రేమ్‌సింగ్, సంజీవ్‌కుమార్, రాజుకుమార్ బాలు, శంకర్, చిన్న శ్రీను, సైదులు, కళ్యాణ్, చిరంజీవి, రామకృష్ణ, చందర్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఈనెల 13న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా ప్రదర్శనను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ అన్నారు. ఆది వారం మండల పరిధిలోని మాదారం గ్రామ పంచాయితీలో గల గోవింద తండాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా సకాలంలో గంటలకు ఎరువులు యూరియా అందక అలాగే అతివృష్టి ప్రకృతి వైపరీత్యాల మూలంగా గత నెల చివరలో వచ్చిన భారీ మొంథా తుఫాను మూలంగా పత్తి వరి మిర్చి మొక్కజొన్న ఇతర అపరాల పంటలు భారీగా దెబ్బతిని చేతికి వచ్చిన అన్ని రకాల పంటలు తడిసి మొలకలు వచ్చి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతాంగం మొత్తం దిక్కుతోచని పరిస్థితిలో ఉందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఇంత వరకు తుఫాన్ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు రైతులు కోయిల శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, బి వీరు, గోవిందు, పాపారావు, నరేష్, సురేష్, ఎర్రయ్య, శివయ్య, గడ్డ వెంకన్న, నరసింహారావు పాల్గొన్నారు.

# చుంచుపల్లి ఎంపివోకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం :** చుంచుపల్లి ఎంపివో సూదకుల సంధ్యను ఆదివారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ , మమత ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన సంధ్య గ్రూప్ 2 ద్వారా మండల పంచాయతీ అధికారిగా ఎంపికైంది. ఈ సందర్భంగా పరిశ సీతా రత్నం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి తన ప్రతిభతో మండల పరిషత్ అధికారిగా ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. సంధ్యను స్ఫూర్తిగా తీసుకుని పలువురు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు ఉన్నత స్థాయికి ఎదగాలని పుల్లయ్య ఆకాంక్షించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవడంతో పాటు ఉన్నత ఆశయం, లక్ష్యంతో ముందుకు సాగాలని అప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకుంటారని తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించిన సంధ్య అసాధారణ ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. సంధ్య వారి కుటుంబానికి కీర్తిని తెచ్చిపెట్టిందని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంధ్య తండ్రి ఉపేందర్‌ను కూడా సహచరులు ఘనంగా సన్మానించారు., ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి జాకీర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఉపేందర్, అముదాల వెంకన్న, అక్రం, ఎల్. వెంకట్, చార్లెస్, బొర్రా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని చెరబడుతున్న మట్టి మాఫియా..!

-పచ్చదనం కోల్పోతున్న పల్లెలు
-అడుగంటుతున్న భూగర్భ జలాలు
-ఆవాసాలు కోల్పోతున్న మూగజీవాలు
-భారీ గోతులతో మూగజీవాల ప్రాణాలకు ముప్పు
మట్టి మాఫియాపై పీడీ యాక్ట్ లు నమోదు చేసి కఠినంగా శిక్షించాలంటున్న పర్యావరణ, జంతు ప్రేమికులు





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజలకు, వన్యప్రాణులకు, ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే పక్షులకు ఇలా ప్రతి ఒక్క జీవికి పర్యావరణం ప్రాణం పోస్తుంటుంది. అలా ప్రాణం పోస్తున్న పర్యావరణాన్ని అక్రమ దరార్జనకు మూలంగా బాటలు వేసుకుని పర్యావరణాన్ని చెరబడుతున్నారు. చెరబట్టడం అనే పదం కఠినంగా ఉన్నా మట్టి మాఫియా విషయంలో వాడక తప్పడం లేదు. సత్తుపల్లి మండలంలో ఓ నాడు ప్రకృతి అందాలు ప్రకృతి ప్రేమికులను, పర్యావరణ నిపుణులను, జంతు ప్రేమికులను కనువిందు చేసి అలరించాయి. కాలక్రమేణ సింగరేణి ఓపెన్ కాస్ట్ పుణ్యమాని పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుండగా, మరోపక్క మట్టి మాఫియా దెబ్బకు ఆ కొద్దిపాటి పర్యావరణం సైతం ప్రమాదంలో పడుతుంది. అక్రమ దనార్జనే ధ్యేయంగా అనుమతులు మరిచి, అడ్డగోలుగా మట్టి తవ్వకాలు చేపడుతున్న మాఫియా దెబ్బకు భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయి. ఉన్న కొద్దిపాటి వృక్షాలు సైతం నేల కొరుగుతున్నాయు. జేసిబీలు, హిటాచ్చి లాంటి మట్టి తొలచే యంత్రాల సాయంతో అడ్డగోలుగా, అక్రమంగా మట్టిని మూడు నుంచి నాలుగు మీటర్ల లోతుతో మట్టిని తొలచి, పదుల కొద్ది టిప్పర్ల సాయంతో పట్టణాల్లోకి ప్రవేశించి రహదారులను గుల్ల చేస్తూ, సందు, గొందుల్లో దూసుకుపోతూ మట్టిని డంప్ చేస్తుంది ఈ మాఫియా.

**పచ్చదనాన్ని కోల్పోతున్న పల్లెలు...**
**ప్రాణాలు కోల్పోతున్న మూగజీవాలు, పక్షులు...**

అక్రమ ధనార్జనకు తెగబడ్డ మట్టి మాఫియా, సింగరేణి భూ నిర్వాసిత గ్రామాల సరిహద్దు ప్రాంతాలను ఎంచుకుని, రైతులను మాయ మాటలతో బోల్తా కొట్టించి, డబ్బును ఎరగా చూపి పచ్చని పొలాలను, బీడు భూములను, ఎకరాలకు, ఎకరాలు ఎటువంటి అనుమతులు లేకుండా రైతుల నుంచి లీజుకు తీసుకుని రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని తొలుస్తుంది. మట్టిని తవ్వే క్రమంలో ఠీవిగా నిలుచున్న చిన్న, పెద్ద వృక్షాలను నిర్దాక్షణ్యంగా తొలగిస్తుంది మాఫియా. ఈ మాఫియా చేస్తున్న అరాచకానికి సత్తుపల్లి మండలం చుట్టుపక్కల గ్రామాలైన పాత కొమ్మెపల్లి, చౌడారం రోడ్డులో కొండలుగా దర్శనమిచ్చిన భూములు నేడు చెరవులను తలపిస్తుండగా పచ్చని చెట్లని మాయమయ్యాయి. మట్టి మాఫియా తవ్వుతున్న భారీ గోతుల మూలంగా భూగర్భంలో దాక్కునే మూగజీవాలైన అడవి పందులు, ఉడుములు, కుందేళ్ళు, నక్కలు, పాములు, పూరేళ్ళు, కౌజు పిట్టలు తదితరాలు కనుమరుగవుతున్నాయి. తద్వారా పక్షులు, మూగజీవాలు ఆవాసాలను కోల్పోయి ప్రాణాలు కోల్పోతుండగా, పచ్చని పల్లెలు పచ్చదనాన్ని కోల్పోయి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి.

**మట్టి మాఫియాపై పీడీ యాక్టులు నమోదు చేయాలంటున్న పర్యావరణ, జంతు ప్రేమికులు...**

అటు పర్యావరణాన్ని, ఇటు భూగర్భ జలాలను సర్వ నాశనం చేయడమే కాకుండా, నోరులేని మూగ జీవాలు, పక్షుల ప్రాణాలను తీస్తున్న మట్టి మాఫియా పై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని, టిప్పర్లను సీజ్ చేయడమే కాకుండా మట్టి తొలిచే యంత్రాలైన జెసిబి హిటాచీలను సైతం సీజ్ చేసి కేసులు నమోదు చేయటంతో పాటు, పట్టుబడుతున్న పట్టు వదలని విక్రమార్కుల్లా అక్రమంగా మట్టిని తోలుస్తున్న మాఫియా పై పీడీ యాక్ట్ లు నమోదు చేయాలని పర్యావరణ, జంతు ప్రేమికులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏన్కూరులో రహదారులు గుంతలమయం..!

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు





**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండలంలో కురిసినటువంటి భారీ వర్షాలకు రహదారులని గుంతల మయంగా మారాయి. ఈ రహదారుల్లో వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏన్కూరు నుండి తూతక్క లింగన్నపేట మీదుగా ఖమ్మం వెళ్లే రహదారి పూర్తిగా గుంతల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో తూతక్క లింగన్నపేట చెరువు అలుగుపడి చెప్ట పై వర్షపు నీరు పారటంతో రోడ్డు మొత్తం కోతకు గురికావడంతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అదే విధంగా జన్నారం మీదుగా పల్లిపాడు నుండి ఖమ్మం వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రమాదాలకు దారితీస్తుంది. ఈ రోడ్డు మార్గం గుంతలు ఉండటంతో ఇటీవల కాలంలో గుంతను తప్పించబోయి ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనటంతో కారులో మంటలు వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు హుటాహుటిన డోర్లు ఓపెన్ చేసుకొని బయటికి రావటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# అడుక్కో గుంత.. భయం భయంగా ప్రయాణం..!





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుంతల మయమై అధ్వాన్నంగా మారాయి. దీంతో ప్రధాన రహదారిపై గుంతలు వాహన చోదకులను భయపెడుతున్నాయి. వాహనదారులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన రహదారులు మృత్యు ఢంకా మోగిస్తున్నాయి. రెండేళ్లుగా ఆర్‌అండ్‌బి అధికారులు తట్ట మట్టి కూడా వేసిన దాఖ లాలు లేకపోవడంతో రోడ్డెక్కాలంటే వాహన చోదకులు వణికిపోతున్నారు. జూలూరుపాడు మండల పరిధిలోని మాచినిపేట తండా నుండి వినోభానగర్ వరకు పెద్దపెద్ద గోతులతో కంకరతేలిన రోడ్లు వాహన చోదకులను బెంబేలెత్తిస్తున్నాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లుకు ఇటీవల కురుస్తున్న వర్షాలు తోడవడంతో ఛిద్రమై పోయాయి. ప్రమాదాలకు కేంద్రాలుగా పలు రోడ్లు మారాయి. పగలు అష్టకష్టాలు పడి రాకపోకలు సాగిస్తున్నా. రాత్రుళ్లు మాత్రం ఆయా రోడ్ల పైకి వెళ్లేందుకు భారీ వాహన చోదకులు సైతం భయపడుతున్నారు. రోడ్లు బాగు చేయండి సారో... అని ఆయా ప్రాంతాల ప్రజలు చేసుకుంటున్న వేడుకోలు అటు అధికారులను, ఇటు ప్రజాప్రతినిధులను కూడా కదల్చలేకపోతున్నాయి.

**వాహన దారుల బాధలు పట్టని అధికారులు, నాయకులు...**

ప్రధాన రహదారిపై గుంటలవలన ప్రమాద సంఘటనలు పునరావృతం అవుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో అసహనానికి దారితీస్తోంది. వర్షాకాలం మొదలైతే రహదారులు మరింత దెబ్బతిని వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా రహదారి అంతా గుంతలమయమై వాహనాలు నష్టపోవడం, ప్రయాణికులు ప్రమాదాలకు గురికావడం మామూలైపోయింది. ఇకనైనా అధికారులు మేల్కొని రహదారిని పునరుద్ధరిస్తారా? లేక మళ్లీ మళ్లీ వాహనాలు గుంతల్లో ప్రమాదాలు జరిగే వరకు చూస్తారా?? అంటూ ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుని రహదారిని బాగు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఎప్పటి వరకు అన్న ప్రశ్న ఇప్పుడు మండలంలో చర్చనీయాంశమైంది.

**మరమ్మత్తులు..మరిచారు..!!**

వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లకు చేసే మరమ్మతులు గత ఏడాది నుంచి నిలిచిపోయాయి. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మినహా అభివృద్ధి పనులకు బడ్జెట్‌ని విడుదల చేయకపోతుండటంతో కొత్త రోడ్ల నిర్మాణం మాట అటుంచి ఉన్న రోడ్ల మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. గతంలో వర్షాకాలంలో ధ్వంసమైన రోడ్లకు సంబంధించి తాత్కాలిక, శాశ్వత మరమ్మత్తుల పేరుతో తొలుత ప్రతిపాదనలు స్వీకరించి ఆ తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్లకు రిపేర్లు చేయించేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఏ కోశాన కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పై గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

# భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆదివాసీ ప్రజల భూములను ఆక్రమిచుకొని నిబంధనలకు విరుద్ధంగా భూభారతిలో పట్టాల కోసం ధరఖాస్తు చేసుకొన్న గిరిజనేతరులపై తగు చర్యలు తీసుకోవాలనిఆదివాసీ సంఘాల జేఏసి నాయకులు అన్నారు. పట్టణంలో గల తెలంగాణ రైతుకూలీ సంఘం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి డి. పున్నంచంద్ అధ్యక్షతన ఆదివాసీ, ప్రజా సంఘాల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సంధర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల పరిధి పాండురంగాపురం రెవిన్యూ ప్రభాత్ నగర్ గ్రామ శివారు 126/152,126/162,126/11 గల సర్వే నెంబర్ గల భూముల్లో కొణదరు వ్యక్తులు పట్టాలు పొందటానికి ధరఖాస్తు చేసుకొన్నారని అన్నారు. అట్టి ధరఖాస్తులును తిరస్కరించి నిజమైన ఆదివాసీలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రెవిన్యూ సర్వే నెంబర్ 126లో ఆదివాసీల భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రెండు దశాబ్దాలుగా 167 మంది పేద ఆదివాసీలు భూముని చదును చేసి సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. భూమిపై కన్నేసిన బూర్గంపాడు మండలానికి చెందిన భూ ఆక్రమణదారులు భూమిపై కన్నేసి సాగుదారులకు సంబంధం లేకుండా తమ డబ్బు పలుకుబడితో రికార్డుల్లో నమోదు చేసుకొని భూ విక్రయాలకు పాల్పడేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అట్టి భూమిపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిజమైన ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసి పాయం సత్యనారాయణ, రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకులు మోరె రవి, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తవరపు జానకీరామ్, ఆదివాసీ సేన నాయకులు ఎలకం రామక్రిష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం స్త్రీసంఘటన జిల్లా కార్యదర్శి తోలెం మమత, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కుంజ వెంకటేశ్వర్లు, కాక సురేష్, కుంజ సోమక్క, గొంది లక్ష్మి, గౌతమి, వర్స ధనమ్మ, రాంబాబు, కారం భద్రయ్య, తెల్లం రాము తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవం

- ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆదాయ పరిమితి గల షెడ్యూల్డ్ కులాలు/తెగలకు చెందిన మహిళలు, పిల్లలు, దివ్యాంగులకు ఉచిత న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అన్నారు. పట్టణ పరిధి వికలాంగుల కాలనీలో జిల్లా న్యాయమూర్తి వసంత్‌పాటిల్ ఆదేశాలతో జాతీయ న్యాయసేవల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో బలహీన వర్గాల వారికి, దివ్యాంగులకు న్యాయ సంహాయం పొందటానికి గల హక్కులను, అవకాశాలను తెలిపారు. ఆర్థిక సామాజిక ఇతర కారణాలతో న్యాయ సహాయం పొందలేని వారికి ఉచితంగా సమర్థవంతంగా న్యాయసేవలను అందించటమే జాతీయ న్యాయ సేవా దినోత్సవ ఉద్దేశ్యమన్నారు. న్యాయసేవల అధికారిక సంస్థల చట్టం 1987 అమలులోకి వచ్చిన సంధర్భంగా ప్రతీ సంవత్సరం నవంబర్ 9న, జరుపుకొంటామని తెలిపారు.ఉచిత న్యాయ సహాయ పథకాలు, లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం, పారాలీగల్ వాలంటీర్ల సేవలు, దివ్యాంగుల హక్కులు , చట్టాలు వంటి అంశాలను వివరించారు.న్యాయపరమైన సమస్యలు ఉంటే న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.నిస్సహాయతతో న్యాయానికి దూరం కాకూడదన్నారు. అనంతరం స్పెషల్ జుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనన్నారు.పేద, ధనిక తారతమ్యం లేదన్నారు. అందరికి న్యాయసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పేదలు ఎలాంటి ఖర్చు లేకుండా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసేవలు పొందటానికి అవకాశం ఉందన్నారు. కావునా వీటికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ పి. నిరంజన్‌రావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జే. గోపీక్రిష్ణ, న్యాయవాదులు ఎర్రపాటి క్రిష్ణ, హరి, దేవేందర్, బి. భిక్షమయ్య, ఎం. జానకీరామ్, కే. వీరభద్రం, బి. రాజమణి, ఏజిఓ రమాదేవి, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, నాయకులు యలకం రామక్రిష్ణ, వజ్జా వాసు పాల్గొన్నారు.

## చిత్రలేఖనంలో ప్రవస్తి ప్రతిభ




**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ నవ భారత్ స్కూల్‌లో ఎనమిదవ తరగతి చదువుతున్న అడుసుమిల్లి ప్రవస్తి చిత్రలేఖనంలో ప్రతిభను చాటింది. ఆంధ్ర ప్రదేశ్ గుంటూర జిల్లా నంబూరులో శుక్రవారం అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో సీనియర్ విభాగంలో ప్రవస్తి మెరుగైన ప్రతిభతో సత్తా చాటింది. దీనితో నిర్వాహకుల చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకొన్నది. గత సంవత్సరంలో ఎన్‌టిపిసి వారు నిర్వహించిన పోటీలలో కూడా స్వితీయ బహుమతితో పాటు నగదు పురస్కారం అందుకొన్నది. చిన్నతనం నుండే చిత్రలేఖనంలో రాణిస్తూ విశేష ప్రతిభను చాటుతున్న ప్రవస్తిని పలువురు పట్టణ ప్రముఖులు, అద్యాపకులు, విద్యార్థులు అభినందిస్తున్నారు.

## జేసు తిరు హృదయ స్వరూపం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** దైవ కుమారుడు యేసు క్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, త్యాగం మానవ జీవితానికి అన్వయింకొని ఇతరులతో శాంతి సమాధానం కలిగి జీవిస్తే ప్రపంచంలో శాంతి సామరస్యం పరిఢవిల్లుతుందని ఖమ్మం కతోలిక పీఠం జ్యుడిషియల్ వికార్ (భూమి, ఆస్తుల పరి రక్షణ) ఫాదర్ బట్టు జయరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గల పునీత నిర్మల మాత దేవాలయం (ఆర్‌సిఎం) ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జేసు తిరు హృదయ స్వరూపాన్ని ఆదివారం ఆశీర్వదించి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విచారణ కర్తలు ఫాదర్ కూరపాటి లూర్దు కిరణ్, సిస్టర్స్ కాన్వెంట్ సుపీరియర్ సౌమ్య, సిస్టర్స్ ఆర్తి, ఆశా, మారియో, అల్ఫోన్సా ఆంటోనియో, సంఘ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ న్యాయం సేవ దినోత్సవం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** జాతీయ న్యాయ సేవల దినోత్సవం పురస్కరించుకొని ఆళ్లపల్లిలోని కస్తూరిబా గాంధీ పాఠశా లలో, ఆళ్లపల్లిలోని భగత్‌సింగ్ సెంటర్ నందు న్యాయ సేవల దినో త్సవం జరిపా రు. ఈకార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పిఎల్‌వి గుండెబోయిన రామకృష్ణ, స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ప్రతి పేదవారికి కూడా న్యాయం జరగాలని, చట్టాలపైన అందరూ అవ గాహన కలిగి ఉండాలని తెలిపారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ గురించి ప్రతి పౌరునికి తెలిసి ఉండాలన్నారు. ప్రతి చిన్న విషయానికి తగాదా పెట్టుకుని, స్టేషన్ల చుట్టూ కోర్టుల చుట్టూ తిరుగుతూ, ఫీజులు కడుతూ డబ్బులు వృధా చేసుకోకుండా, రాజీమార్గమే రాజమార్గమనే విషయాన్ని అందరు కూడా పాటించాలని, షెడ్యూలు కులాలు, షెడ్యూల్ తెగల వారికి, పేదలందరికీ కూడా ఎటువంటి రుసుము లేకుండా సమస్య సముచితమైతే అటువంటి పేదవారికి కోర్టు తరపు నుండి లాయర్‌ను ఉచితంగా నియమించడం జరుగుతుందని సూచించారు. ఈకార్య క్రమంలో ఏ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయురాలు సిహెచ్ సుధ, సోషల్ ఉపాధ్యా యులు, గ్రామస్తులు కే చంద్రకళ, ఎన్ పద్మ, సుభ్రద, లలిత, మమత పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న అయ్యప్ప దీక్షపరులు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో అయ్యప్ప దీక్షపరులు గురు స్వామి రణం మల్లికార్జున్ ఆధ్వర్యంలో ములుగు జిల్లాలోని మంగపేట మండలం మల్లూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మి నరసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దీవెనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు భద్రం స్వామి, రాజబాబు స్వామి, భరత్ స్వామి, జనార్ధన్ స్వామి, నగేష్ స్వామి, వెంకన్న స్వామి, శేఖర్ స్వామి, సాగర్ స్వామి, సాయి స్వామి, నవీన్ స్వామి, వెంకటేశ్వర స్వామి, వినయ్ స్వామి, నితీష్ స్వామి, నిఖిల్ స్వామి, విశ్వనాథం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుతో అవస్థలు



**ప్రజాపక్షం/చింతకాని :** కొదుమూరు నుండి అల్లీపురం మీదుగా ఖమ్మం నగరానికి నిత్యం వందలాదిమంది వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు.కొదుమూరు నుండి బస్వాపురం క్రాస్ రోడ్డు వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# వన భోజనాలతో ఐక్యత, స్నేహభావం

**- ఆర్యవైశ్య వనభోజన మహోత్సవంలో ఎంఎల్ఏ కూనంనేని**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్తీక మాస వనభోజనాలతో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందని కొత్తగూడెం ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచలోని లక్ష్మీ గార్డెన్స్, లక్ష్మీ దేవిపల్లి మండల యల్లావుల పాపారావు తోటలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య వనారాధన సామూహిక వన భోజనాల కార్యక్రమాలకు ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా హాజర య్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కార్తీక మాస వన భోజన మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్తీక మాస వన భోజన మహోత్సవాల ద్వారా ఆధ్యాత్మిక భావాలు, సోదర భావాలు పెంపొందుతాయని, ఒకే చోట చేరి సామూహికంగా భోజనాలు చేయడం అభినందనీయం అన్నారు. సామాజిక సేవా రంగాల్లో ఆర్యవైశ్యులు అగ్రస్థానంలో అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. పూర్వం నుంచి సమాజ శ్రేయస్సు కోసం వన భోజన మహోత్సవాలు ఆచారంగా నిర్వహిస్తున్నారని, ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులను అభినం దించారు. ఇందులో భాగంగా ప్రజలందరికీ కార్తీక మాస శుభా కాంక్షలు తెలిపారు. అనతరం వనమహోత్సవం సందర్భంగా ఎంఎల్ఏ కూనంనేనికి, సాబీర్ పాషాకు షాలువాలు కప్పి సత్కరించారు.

# సిపిఐ సీనియర్ సభ్యురాలు సుగుణమ్మ మృతి



**ప్రజాపక్షం/ చింతకాని :** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ (92) ఆదివారం మరణించారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన సుగుణమ్మ భర్త వంకాయలపాటి సీతయ్య సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పనిచేశారు. సుగుణమ్మ రెండు సార్లు ఖమ్మం సమితి సభ్యురాలిగా పనిచేశారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా సుగుణమ్మ కొనసాగారు. సుగుణమ్మ జాతీయ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకురాలిగా రెండు దశాబ్దాల కాలం పాటు వివిధ హోదాలలో పని చేశారు. ఆమె కుమారుడు వంకాయలపాటి సత్యనారాయణ సిపిఐ నుంచి ఎంపిటిసిగా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ సుగుణమ్మ మృతి పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని వారు సంతాప సందేశంలో పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సుగుణమ్మ మృతదేహాన్ని సందర్శించి అరుణ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, మండల నాయకులు తాళ్లూరి యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు రంగారావు తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనమే వనసమారాధన

**- మధిర ప్రెస్ క్లబ్ కోశాధికారి కాకరపర్తి శ్రీనివాస్‌కు ఘన సన్మానం**





**ప్రజాపక్షం/ మధిర :** జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనమే వనసమారాధన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని మధిర మెయిన్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ పేర్కొన్నారు. కార్తీక మాసం సందర్భంగా మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు మామిడితోటలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రెస్ క్లబ్ జర్నలిస్టులందరూ సందడి సందడి చేస్తూ వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ మాట్లాడుతూ మధిర ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకోవటంతో పాటు గతంలో ఎన్నడూలేనివిధంగా నియోజకవర్గ కేంద్రమైన మధిరలో ప్రెస్ క్లబ్ కార్యాలయం ఏర్పాటు చేయటం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటై తక్కువ సమయంలోనే జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శంగా ఏర్పాటు చేసుకున్న వన సమారాధన కార్యక్రమంలో జర్నలిస్టులంతా పాల్గొని విజయవంతం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వన సమారాధన కార్యక్రమ ఏర్పాటుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన ప్రజాపక్షం మధిర ఆర్‌సి ఇన్‌చార్జి, ప్రెస్ క్లబ్ కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావుకు ప్రెస్ క్లబ్ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య పాల్గొని జానపద గేయాలతో చైతన్యాన్ని కలిగిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలపై వివరించి ఆ దిశగా సామాజిక కార్యక్రమాల్లో తమవంతుగా ప్రెస్ క్లబ్ పాలు పంచుకుని సహాయ సహకారాలు అందించాలని కోరారు. వన సమారాధన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉప కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షులు లిక్కి రవీందర్, ప్రచార కార్యదర్శి అర్జున్, సహాయ కార్యదర్శులు వాసు, బాణాల రామకృష్ణ, గౌతమ్, చారుగుండ్ల నర్సింహామూర్తి, బాణాల శంకరాచారి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర ప్రెస్ క్లబ్ కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావుకు ఘన సన్మానం..

మధిర ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణాపురం మామిడితోటలో వన మహోత్సవ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన మధిర ప్రెస్ క్లబ్ కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావును ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వనసమారాధన కార్యక్రమ నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన కాకరపర్తి శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రహదారిపై ఏర్పడిన గుంతలను స్వచ్ఛందంగా పూడ్చివేశారు. ఖమ్మం నుండి చిమ్మపుడి, పాపటపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో రేగులచలక, కోయచలక గ్రామాల మధ్య రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల వల్ల రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను గుర్తించి రేగులచలక మాజీ ప్రజాప్రతినిధులు నున్నా వెంకటేశ్వరరావు, కొర్లపాటి రామారావులు స్వచ్ఛందంగా రహదారులపై ఏర్పడిన గుంతలను కాంక్రీట్‌తో పూడ్చివేశారు. రేగులచలకలో దొండపాటి రమేష్ ఇంటి ముందు ప్రమాదకరంగా ఉన్న గుంతను, కోయచలక, రేగుల చలకలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద గల గుంతను, బస్టాండ్ సెంటర్‌లోని పెద్ద గుంతను కాంక్రీట్‌తో పూడ్చారు. కోయచలక బిసి కాలనీలో లింక్ రోడ్ల మధ్య పాడైపోయిన ర్యాంపులకు మరమ్మతులు చేపట్టారు. ప్రమాదకరంగా గుంతలు స్వచ్ఛందంగా పూడ్చినందుకు ఇరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వాసిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్న ప్రసాద వితరణ చేశారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలోని నిత్య అన్నప్రసాద సేవా కేంద్రంలో రోగి సహయకులకు వాసిరెడ్డి కుసుమ సంస్మరణార్థం వాసిరెడ్డి సేవా సమితి తరుపున అన్నప్రసాద వితరణ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగి సహయకులకు నిత్య అన్నప్రసాదం నిర్వహించడం ఎంతో అభినందనీయమని వాసిరెడ్డి సేవా సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సేవా సమితి సభ్యులు చక్రథర్‌రావు, అర్జున్‌రావు, పవన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యం



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రపంచంలో ఈ భూమి మీద ఎక్కడైనా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలకు వాటి పరిష్కారానికి ప్రత్యామ్నాయం ఎర్రజెండా మాత్రమే చూపగలదని సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర వక్కానించారు. అరాచక శక్తుల చేత చంపబడిన సిపిఎం నాయకుడు నిత్యం స్ఫూర్తి ప్రధాన, పోరాట యోధుడు కామ్రేడ్ వినోదరావు రవి కుమార్ 29వ వర్ధంతి పార్టీ మండల కమిటీ సభ్యులు, బాజు మల్లాయిగూడెం శాఖ కార్యదర్శి వల్లబోయిన కొండలరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో కే నరేంద్ర మాట్లాడుతూ నేడు ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాదం ఆయుధాలతో తనకు ప్రత్యామ్నాయం చూపే తన మిత్రులను తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి చేస్తున్న ఉక్రెయిన్ రష్యా, ఇజ్రాయిల్ అనేక దేశాల మీద దాడులు చేస్తున్నాయని ఇది మొదటి రకమని, టారిఫ్‌లతో ట్రంప్ మరో రకమైన యుద్ధం చేస్తున్నాడని ఈ కారణంగా అమాయకులు, పేదలు మరణిస్తూ ప్రపంచ ప్రజలకు సమస్యగా పెట్టుబడిదారీ విధానం మారిందని దీనికి ప్రత్యామ్నాయంగా సోషలిజం అవలంభిస్తున్న పేదరిక నిర్మూలన, అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదిరిస్తూ చైనా, వియత్నం, క్యూబా, ఉత్తర కొరియా, లావోస్ వంటి కమ్యూనిస్టు దేశాలు, ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయంగా వామపక్షలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. వినోద రావు రవికుమార్ స్థూపం ముందు జెండాను పార్టీ నాయకులు షేర్ వెంకటేశ్వర్లు ఎగురవేశారు. ఈ వర్ధంతి సభలో పార్టీ సీనియర్ నాయకులు రాచబంటి పుల్లయ్య, ఎర్రిపోతు భద్రయ్య, మన్యం బ్రహ్మయ్య, పోతురాజు చందర్రావు, మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు, అజ్మీర శోభన్ బాబు, శాఖ కార్యదర్శి రేమల్లె వీరస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, రాచర్ల విజయ్, ఎస్‌కే సైదులు, రేమల్ల బాబు, పుష్పాల మల్లయ్య, మాచర్ల రమేష్, వినోదరావు, రవికుమార్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


# మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి

**-ప్రభుత్వ ఉపాధ్యాయుడు విచిత్ర వేషధారణలో ప్రచారం**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సూర్యాపేట జిల్లా, మద్దిరాల మండలం లోని గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రభాకర్ డ్రగ్స్ రహిత సమాజ లక్ష్యంగా ప్రజలలో చైతన్యం నింపేందుకు బైక్ యాత్ర ను చేపడుతున్నారు. ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సిద్ధిపేట, సూర్యాపేట, జనగాం . కరీంనగర్, సిరిసిల్ల తదితర జిల్లాలో యాత్ర పూర్తి చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం కు చేరుకుంది. ప్రధాన సెంటర్ లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రాచకొండ ప్రభాకర్ కోరారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతతప్పుడు మార్గాల ద్వారా మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని దానిని సాధించే దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. మత్తు రహిత సమాజ స్థాపన కు నో డ్రగ్స్... సేవ్ లైఫ్ అనే నినాదాంతో సెలవు రోజులలో జాతరలు, ఉత్సవాలు, వారసంతలు జరిగే చోట విస్తుతంగా ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయుడు ను స్థానికులు పలువురు అభినందించారు.

# మిరుమిట్ల దీపాలు.. గాల్లో ప్రాణాలు..!



- వాహనాలకు మితిమీరిన రంగురంగు లైట్లు
- ఎదురుగా వచ్చే వారికి తీవ్ర ఇబ్బంది
- పొంచి ఉన్న ప్రమాదాలు
- రాత్రివేళల్లో పెరుగుతున్న ప్రమాదాలు
- పోలీస్, రవాణా శాఖలు దృష్టిసారించాలని వేడుకోలు



**మోటారు సైకిల్ మొదలుకుని కార్లు, లారీలు, బస్సులు ఇతర వాహనాలకు ఈ మధ్య అమర్చుతున్న రంగురంగుల మిరుమిట్లు గొలిపే ఎల్ఇడి లైట్లు ఎదురుగా వచ్చే వారి ప్రాణాల మీదికి తెస్తోంది. తమ వాహనాలు అందగా రంగులతో మెరిసిపోవాలని ఆలోచించే వారు ఎదుటివారి రక్షణను మరుస్తుండటంతో పాటు ప్రణాలతో చెలగాటం అడుతున్నారు. . నిబంధనలకు విరుద్ధంగా రోజురోజుకీ పెరిగిపోతున్న మిరుమిట్ల దీపాలపై పోలీస్, రవాణా శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గతంతో పోలీస్తే రోడ్ల మీద ద్విచక్ర వాహనాలను మొదలు పెద్దపెద్ద వాహనాలు రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల రద్దీ కూడా పెరిగిపోయింది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఈ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా సాగించే రంగురంగులైట్ల వ్యవహారంలో ఎదురుగావచ్చే వారికి ప్రాణ సంకటంగా మారింది. వాహనాలు తయారీ చేసే సమయంలో ఎన్ని లేట్లు ఉండాలి అనే ఓ లెక్క ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆయా వాహనాలకు లెక్కలకు మించిన మిలుకుమిలుకు లైట్లు విపరీతమైన వెలుతురులు వెదజల్లుతున్నాయి. వాహనదారులు ఇష్టం వచ్చినట్లు వేసుకునే లైట్ల వల్ల పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల మీద పడాల్సిన లైట్లు ఆకాశం మీదికి, ఎరుపు రంగులో సిగ్నల్ ఇవ్వాల్సిన లైట్లు నీలి రంగులతో కనిపిస్తున్నాయి. మరో ప్రక్క ఎక్కువ వెలుతురు రావాలని ఎల్ఇడి లైట్లు అమర్చి ఎదురుగా వచ్చే వారి ముఖం మీద పడేలా విచ్చిల విడితనాన్ని ప్రదర్శిస్తుంటారు. ఈ ఎల్ఇడి లైట్ల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటి ద్వారా ఎక్కువ ఫోకస్ వస్తుండటంతో ఎదురుగా వచ్చే వారు కళ్లకు తీవ్ర ఇబ్బంది ఎదురై వారి తడబడే ప్రమాదం ఉంది.

### పద్ధతి లేకుండా...

పద్ధతి లేకుండాఇష్టాను సారంగా రంగురంగుల లైట్లు అమర్చడం చట్ట విరుద్ధం. మోటార్ వెహికిల్ యాక్ట్, సెంట్రల్ మోటార్ వెహికిల్ రూల్స్ ప్రకారం మోటార్ సైకిల్ అయినా, కారు, లేదా ఇతర ఏ పెద్ద వాహనాలు అయినా హెడ్ లైట్లను ఆటోమెటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్టాండర్డ్ ప్రకారం అమర్చాలి. రానీ అందుకు విరుద్ధంగా వాహనాలకు రంగురంగుల లైట్లు పెడుతున్నారు. రోడ్డంతా కనిపించాలనే ఉద్దేశ్యంతో సాధారణంగా ఎల్ఇడి హెడ్ లైట్స్ 55/60 వాట్స్ హోలజన్ బల్బులు లేదా 3వేల ల్యూమెన్స్ ఎల్ఇడి బల్బులు వరకు అమర్చుకోవచ్చు. బైక్ అయితే 35/35 వాట్స్, కారుకు 55/60 వాట్స్, లారీ,గూడ్స్ వాహనానికి 55/60వాట్స్ వరకు ఎల్ఇడి బల్బులను పెట్టుకోవచ్చు. కానీవాటికంటే ఎక్కువ సామర్థ్యాన్ని కలిగినవాటిని పెట్టుకోవడం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నమనే సంగతి మర్చిపోతున్నారు.

### రాత్రివేళల్లో ప్రమాదాలు...

ఎక్కువ కాంతిని వెదజిమ్మె వాహన లైట్ల వల్ల రాత్రివేళల్లో పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రిపూట జరిగే రోడ్డు ప్రమాదాల్లో 30 శాతం ఎల్ఇడి లైట్ల ద్వారానే జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అత్యంత వెలుతురు వచ్చే లైట్లు సుమారు 200 నుండి 300 మీటర్ల దూరంలో ఉండగానే కళ్లు బైర్లు కమ్మేలా ఉంటున్నట్లు పలువురు వాహన దారులు వా పోతున్నారు. ఎదురుగా వస్తేవాహనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అంటూ లెక్చర్లు ఇచ్చే వారు ఉన్నారే తప్ప ప్రమాదాలకు కారణమైన మూలాలను నిర్మూలించే పని ఎవ్వరూ చేయడం లేదనే వాదన బలంగా ఉంది.

### పోలీస్, రవాణా శాఖలు దృష్టి సారిస్తే మేలు...

పెద్దపెద్దగా వెలుదురు వెదజల్లే రంగురంగుల వాహన లైట్ల విషయంలో పోలీస్ శాఖతో పాటు రవాణా శాఖ దృష్టి సారించాలని పలువురు అంటున్నారు. మోటార్ సైకిళ్లకు ఎక్కువ శబ్ధం వచ్చే సైలెన్సర్లు అమర్చిన సమయంలో ప్రజల మేలు కోసం పోలీసులు దారికాచి మరీ వాహనాలను సీజ్ చేశారు. లైట్లవిషయంలో కూడా పోలీసులు, రవాణాశాఖాధికారులు సంయుక్తంగా రాత్రివేళల్లో గస్తీగాసి మితిమీరిన రంగురంగుల లైట్లతో ఉండే వాహనాలను నిలుపుదల చేసి అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### హాని కలిగే చర్యలు వద్దు : రెహమాన్, డిఎస్పి, కొత్తగూడెం



వాహనాలకు అమర్చే అతి వెలుతురు వెదజిమ్మె ఎల్ఇడి దీపాల వల్ల ఎదురుగా వచ్చే వాహానానికి ఇబ్బందే. ఎదుటి వారికి ఇబ్బంది కలిగే పనులు ఎవ్వరు చేసినా తప్పే. మోటార్ వాహన చట్టం నిబంధనలు ప్రతీ ఒక్కరూ పాటించాలి. ఆయా నిబంధనలను అనుసరించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం. ముందుగా వాహన దారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

### కేసులు రాస్తూనే ఉన్నాం : సంగం వెంకట పుల్లయ్య, మోటర్ వాహన ఇన్స్పెక్టర్ భద్రాచలం



బండ్లు కొనంగానే రంగురంగు లైట్లు పెట్టుకుని మోటార్ వాహన చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువ కాంతిని ఇచ్చే లైట్లవల్ల జరిగే ప్రమాదాలపై పలు మార్లు వాహన దారులకు అవగాహన కల్పించాం. అయినా కొందరిలో మార్పు రావటం లేదు. ఇప్పటి వరకు పలు సందర్భాల్లో అనేక కేసులు నమోదు చేసి జరీమానాలు విధించాం.

---

## రెండో రోజు ఉత్సాహంగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

**-నేడు ఫైనల్ కబడ్డీ పోటీలు.. మంత్రి సీతక్క రాక**



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలం ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కబడ్డీ పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీలలో పది జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు కబడ్డీ పోటీలను చూపేందుకు వీక్షకులు సైతం భారీగా చేరకుని ఆటలను తిలకించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామం ఈ బయ్యారంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలకు వేదిక కావడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ పోటీలను జిల్లా అధికారులు, మండల స్థాయిలు నిత్యం పర్యవేక్షిస్తూ క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలను తీసుకుంటున్నారు.

### నేడు ఫైనల్ మ్యాచ్...

నేడు ఫైనల్ మ్యాచ్ కావడంతో అందరికి చూపు నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌పైనే ఉంది. ఈ ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు ఈ జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం అధిక సంఖ్యలో వీక్షకులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

### నేడు మంత్రి సీతక్క రాక....

ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కబడ్డీ పోటీలకు నేడు జరిగే ఫైనల్ కబడ్డీ పోటీలను రాష్ట్ర మంత్రి ధనసరి అనసూర్య(సీతక్క) రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాటులకు చేశారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌లు పోటీలలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలను తీసుకోవడంతో పాటు, నిరంతరం అధికారుల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

---

## సిఎంఫిఎఫ్ పెన్షనర్ల కొరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపుల నిర్వహణ




**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0లో భాగంగా దేశ వ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్స్‌లో డిజిటల్ సాధికారత పెంచాలనే ఉద్దేశంతో పెన్షనర్స్ తమ ఆండ్రాయిడ్ మొబైల్ నుంచే మొబైల్ అప్పికేషన్ ద్వారా సిఎంపిఎఫ్ సిపిఆర్ఎంఎస్ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించేందుకు అవగాహన కల్పించేందుకు క్యాంపులను నిర్వహించాలని జిఎం కృష్ణయ్య ఆదేశించారు. దానికి అనుగుణంగా సింగరేణి సంస్థ కోల్‌మైన్ ప్రావిడెంట్ సంస్థల ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్‌లను నిర్వహించబోతున్నామని, ఇందులో భాగంగా ఈనెల 11వ తేదీ ఉదయం 10గంటలకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపును యెసిఓఏ క్లబ్, ఓల్డ్ కాలనీ నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. సిఎంపిఎఫ్ పెన్షన్ పొందుతున్న సింగరేణి మాజీ ఉద్యోగులు సిపిఆర్ఎంఎస్ కార్డు దారులు ఈ అవకాశములను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# వామ్మో రోడ్లు.. ప్రజల పాట్లు..!





- ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇసుక లారీలు
- పట్టించుకోని పాలకులు
- స్వచ్ఛందంగా మట్టితో పూడుస్తున్న వైనం
- నిధులు విడుదలైనా మొదలు కాని పనులు



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రధాన రహదారి నరక ప్రాయంగా మారింది. ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు నానా పాట్లు పడుతూ వామ్మో ఇదెక్కడి రోడ్డు స్వామి అంటూ భయాందోళనకు గురవుతున్నారు. భద్రాచలం మొదలుకుని వెంకటాపురం వరకు ఉన్న ప్రధాన రహదారి గోతుల మయంగా మారింది. ఇసుక లారీలు పుణ్యమా అంటూ సుమారు 100 కి.మీ పొడవునా భారీ గోతులు ఏర్పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా భద్రాచలం గోదావరి పరివాహక ప్రాంతంలో నాణ్యమైన ఇసుక లభ్యమవుతుండటంతో ఇక్కడ ప్రభుత్వం తరుపున ఇసుర ర్యాంపులు నడుపుతున్నారు. హైదరాబాద్ నుండి మొదలుకుని అనేక ప్రాంతాల నుండి నిత్యం వందలాది లారీలు ఇసుక కోసం ఇక్కడికి చేరుకుంటున్నాయి. ఓవర్ లోడింగ్‌తో వాహనాలు వెలుతుండటంతో వెంకటాపురం మొదలుకుని భద్రాచలం వరకు గల ప్రధాన రహదారి భారీ గోతులతో నిండిపోయింది. రోడ్డుపై ఉన్న తారు అంతా లేచిపోయి కంకర తేలింది. వాహనాల రాకపోకలతో అక్కడి మట్టి గాలికి లేస్తూ తీవ్ర ఇబ్బందిని కలిగిస్తోంది. ఈ రోడ్లు గుండా ఇంటికి చేరాలంటే పూర్తి మట్టి మనిషులుగా మారిపోతున్నారు.

### ప్రాణాలతో చెలగాటం :

ఇసుక కోసం వచ్చే లారీలు ఈ ప్రాంత ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఓవర్ లోడింగ్‌తో వెళుతున్న లారీలు దుమ్మును వెదజల్లుకుంటూ వెళుతుండటంతో వెనుక, ముందు నుండి వచ్చే వారికి దారికనిపించే పరిస్థితి లేదు. ఈ క్రమంలో పలు ప్రమాదాలు చోటు చేసుకోగా పదలు సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో పాటు అనేక మంది క్షతగాత్రులయ్యారు. ఎర్పడ్డ గోతుల్లో లారీలు ఇరుక్కు పోయి గంటల కొద్ది ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. మాములు రోజుల్లోనే ఇలా ఉంటే ఇక వర్షా కాలంలో మాత్రం పరిస్థితి అత్యంత భయానకంగా మారుతోంది. కాలానికి అతీతంగా ఈ ఏడాది వానలు పడ్డాయి. ఈ వర్షాలతో రోడ్లు పొడవునా ఏర్పడ్డ గోతుల్లో నీరు నిల్వ ఉండటంతో దారిని అంచనా వేయలేక అనేక మంది పెద్ద పెద్ద ప్రమాదాలకు లోనయ్యారు. వాహనాలతో పాటు గోతుల్లో పడిపోయి ప్రాణాలు సైతం కోల్పోయారు.

### పట్టింపులేని పాలకులు :

ఇసుక లారీల వల్ల ధ్వంసమైన రోడ్లకు మరమ్మత్తులు చేయాలంటూ సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగినప్పటికీ కంటి తుడుపు వాగ్ధానాలను ఎంఎల్ఏ చేసేరా తప్ప సమస్య పరిష్కారం కోసం నేటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్లపై బైఠాయించి రహదారుల నిర్బంధం చేశారు. దీంతో కంటి తుడుపు చర్యగా నాలుగు రోజుల పాటు ఇసుక లోడింగ్ అపిన అధికారులు మళ్లీ యధారాజ్యా తధా ప్రజా అన్నచందంగా ఇసుక తోలకాలు పెద్దఎత్తున సాగిస్తున్నారు. పాలకుల్లో చెలనం లేకపోవడంతో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల వారు వారి వారి ప్రాంతాల్లో ఉన్న గోతులను మట్టితో పూడుస్తూ ప్రజలు ప్రమాదాల భారినపడకుండా తమవంతుగా కృషి చేస్తున్నారు.

### పనులు మొదలు పెట్టాలి :

భద్రాచలం డివిజన్‌లోని భద్రాచలం నుండి చర్ల మండలం శివారు వరకు గల సుమారు 55 కి.మీ రోడ్డు పనుల కోసం సుమారు రూ.67 కోట్లు మంజూరయ్యాయి. ఆ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదిన టెండర్లు పిలిచారు. టెండర్లు వేసుకునేందుకు ఈనెల 17వ తేది వరకు అవకాశం ఉంది. త్వరిత గతిన పనులు మొదలు పెట్టి పరిస్థితిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

### పనులు నాణ్యతతో చేపట్టాలి :
### రావులపల్లి రవికుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు



55 కి.మీ మేరా చేసే రోడ్డు పనులు కల కాలం నిలిచేలా నాణ్యతతో నిర్మించాలి. గోదావరి పరివాహక ప్రాంతం కావడంతో వరదలు వచ్చినప్పటికీ రోడ్లు దెబ్బతిన కుండా ఓవర్ లోడింగ్ ఇసుక లారీలు తిరిగనప్పటికీ ధ్వంసం కాకుండా ఉండేలా పనులు చేయాలి. నాణ్యత ప్రాణాల్లో ఎలాంటి లోపాలు ఉన్న ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

---

## స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో నెలకొన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని 17వ డివిజన్ శ్రీనివాస్ నగర్ శాఖ సమావేశంలో వై. విక్రమ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నగరంలో పలు డివిజన్లలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయన్నారు. రోడ్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సైడ్ డ్రైన్లు శుభ్రం చేయకపోవడంతో కంపుకొడుతున్నాయన్నారు. డివిజన్లలో ప్రజలు పారిశుధ్య లోపం వల్ల రోగాల భారీనపడుతున్నారన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు పెరిగాయని వాటిని పట్టించుకునే నాధుడే లేడన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు మంజూరు చేయాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు యర్రా రంజిత్, చౌదరి, బడేమియా తదితరులు పాల్గొన్నారు.



## ఎస్టి జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి

- -15న చలో అచ్చంపేట
- -జేఏసి ఛైర్మన్ రామకృష్ణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్టి జాబితా నుంచి వలస లంబాడీలను తొలగించడమే లక్ష్యంగా విస్తృత ఉద్యమాలు నిర్వహించనున్నట్లు ఆదివాసి 9 తెగల కార్యచరణ సమితి ఛైర్మన్ చుంచు రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఖమ్మం బల్లేపల్లిలోని జేఏసి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ వలస లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించేంత వరకు జేఏసి జెండా, అజెండా ఒకటేనన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 15న చలో అచ్చంపేట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఈనెల 23న మహబూబాబాద్ జిల్లా గుంజేడులో, 30న ఇల్లందు బొగ్గుట్టలో, డిసెంబర్ నాలుగున చిరుమళ్లలో విస్తృత సన్నాహక సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ తొమ్మిదిన ఆసిఫాబాద్‌లో జరిగే బహిరంగ సభకు రాజకీయాలకతీతంగా ఆదివాసీలు లక్షలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అచ్చంపేట, బొగ్గుట, చిరుమళ్ల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆధార్ సొసైటీ అధ్యక్షులు కల్తీ వీరమల్లు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నాక విజయ్, మైపతి అరుణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మినారాయణ, ఆదివాసి మహిళా చైతన్యశక్తి ఛైర్మన్ పూసం వెంకటలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులు కురసం పద్మజ, ఆర్టిఐ డేటా కమిటీ ఛైర్మన్ బట్టు వెంకటేశ్వర్లు, నల్లమల చెంచుల ప్రతినిధి కాట్రాజు శ్రీను, జేఏసి నాయకులు సీతారాములు, భాస్కరరావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపుసభను జయపద్రం చేయాలని ప్రచారం



**ప్రజాపక్షం/ఇల్లందు:** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయపద్రం చేయాలని కోరుతూ గడపగడపకు సిపిఐ కార్యక్రమం ఆదివారం మండలంలో నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కార్యవర్గ సభ్యులు బంధం నాగయ్య, మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయితీ సుదిమల్ల గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్, సిపిఐ సీనియర్ కాయం పాపయ్యని గౌరవ పద్రంగా కలిసి ఆయన యోగక్షేమాలు తెలుసుకొని శతాబ్ది ఉత్సవాల వేడుకల గురించి వివరించారు. తర్వాత ఆ ప్రాంతంలోని కార్యకర్తలను పార్టీ సానుభూతిపరులను కలిసి డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు రైతులు వ్యవసాయ కూలీల చేతి వృత్తులు వాళ్ళు మహిళలు యువకులు విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతులను వ్యాపార వర్గాలను కలిసి వివరాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఇల్లందు మండల కార్యవర్గ సభ్యులు మంచాల వెంకటేశ్వర్లు, ఆలెం రాఘవేంద్రరావు, జక్కుల కనకయ్య, కోటిలింగం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



**ప్రజాపక్షం/గుండాల :** మండల కేంద్రంలోని నాగెల్లి వెంకన్న కు చెందిన ఫర్నీచర్ వర్క్ శాఫ్ ప్రమాదవశాత్తు జరిగినఅగ్ని ప్రమాదంలో సుమారు నాలుగులక్షలకు పైగా ఆస్తి సష్టం వాటిల్లి నట్లు బాదితులు తెలిపారు. ఆదివారం నాడు చర్చికి వెల్లిన సందర్భంలో ఈ ఘటన చోటు చేసుకుందని తెలిపారు. తాను ఇటీవలే ఒక సిక్స్ ఇంటూ సిక్స్ మంచం అమ్మిన డబ్బులను సైతం వర్క్ శాప్‌లో ఉన్నాయని, చేసిన ఫర్నీచర్ ఉందని, ఈ ప్రమాదం ఎలా జరిగిందో అర్ధం కావడం లేదని కుటుంబ సభ్యులు ఆవేదనతో తెలిపారు. దీనిపై అధికారులు పూర్తి దర్యాప్తు చేసి .ప్రభుత్వం ఆదుకోవాలని బాదిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.